# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-04-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైయస్సార్ కడప జిల్లాల్లో పర్యటించనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.

2. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర ప్రభుత్వం.

3. సంపద సృష్టి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్న మంత్రి నిమ్మల రామానాయుడు.

4. హైదరాబాద్‌లో ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఈ రోజు నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్న తెలంగాణా ప్రభుత్వం.

5. ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి శాసన సభ నియోజకవర్గంలో 'ఆదర్శ సౌర గ్రామాలు' ఏర్పాటు చేయనున్నామని వెల్లడించిన మంత్రి గొట్టిపాటి రవి కుమార్.

==========================

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, వైయస్సార్ కడప జిల్లాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పర్యటిస్తారు. మొదట నెల్లూరు జిల్లా, వింజమూరులో నిర్వహించే "పేదల సేవలో కార్యక్రమం"లో పాల్గొని లబ్దిదారులకు పింఛన్లు పంపిణి చేస్తారు. అనంతరం పాతూరు ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఏప్రిల్ నెలకు గానూ రాష్ట్ర వ్యాప్తంగా 62.60 లక్షల మంది పింఛనుదారుల కోసం 2 వేల 724 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ కార్యక్రమం అనంతరం ముఖ్యమంత్రి కడప జిల్లాలోని ఒంటిమిట్ట చేరుకొని శ్రీ కోదండ రామ స్వామి వారి కళ్యాణ మహోత్సవం సంధర్భంగా సీతారాముల వారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, తలంబ్రాలను సమర్పిస్తారు. ఈ మేరకు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

--------------------------

రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఈరోజు లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు పేరుతో ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ అధికారులు ఈ బిల్లును లోక్‌సభ బిజినెస్ జాబితాలో చేర్చారు. ఈ అంశంపై నరసారావు పేట

పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు నిన్న ఢిల్లీలో మాట్లాడుతూ పునర్విభజన చట్టం 2014లోని సెక్షన్ 5 లోని సబ్ సెక్షన్ 2కి సవరణలు చేయనుందని తెలిపారు. ఇప్పటికే అమరావతికి రాజధానిగా చట్టబద్ధత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపిందని ఆయన తెలిపారు.

---------------------------

సంపద సృష్టి ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమం"లో మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ, అభివృద్ధితో పాటు, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తోందని తెలిపారు. 2027 నాటికి పోలవరాన్ని పూర్తి చేసేలా పనులు చేయనున్నామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

హైదరాబాద్ పరిధిలో ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ఈరోజు నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నామని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ-ఎంఆర్డీసీఎల్ అధికారులతో హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ఆయన నిన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ఈరోజు నుంచి 15 రోజులపాటు ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని చెప్పారు. మూసీ పరీ వాహక ప్రాంత ప్రజలు, వేర్వేరు రంగాల నిపుణులు సలహాలు, సూచనలు చేయవచ్చని అన్నారు. ప్రాజెక్టుపై అభిప్రాయాలను musi-project@telangana.gov.in మెయిల్ ఐడీకు పంపవచ్చని తెలిపారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకు వెళతామని భట్టి విక్రమార్క వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా చేనేత కార్మికులకు ఈరోజు నుంచి ఉచిత విద్యుత్ అమలు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం కింద సాధారణ చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను, అలాగే మర మగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందించనుంది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా మొత్తం లక్షా 4 వేల 488 చేనేత కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని, పథకం అమలు కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు 150 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుందని అధికారులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో పెట్రోల్, డీజిల్ కొరత లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఆయిల్ డీలర్లు, అధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి శాసన సభ నియోజకవర్గంలో 'ఆదర్శ సౌర గ్రామాలు' ఏర్పాటు చేయనున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమావేశమయ్యారు. ప్రధానమంత్రి సూర్యఘర్, విద్యుత్ పంపిణీ సంస్థల పునర్వ్యవస్థీకరణ పథకం –ఆర్‌డీఎస్ఎస్ పథకాలు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోఓల్టేజ్ సమస్యలపై ఈ సమావేశంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, విద్యుత్ పంపిణీ సంస్థ – డిస్కం పరిధిలోని 63 నియోజకవర్గాల్లో రెండు లక్షల విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

పరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యమివ్వాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, జిల్లాల పర్యటనల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, క్షేత్ర స్థాయిలో పనితీరును అంచనా వేయాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంచేందుకు అమరావతిలో రాష్ట్రస్థాయి శిక్షణ కేంద్రం, ప్రాంతాల వారీగా జోనల్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

---------------------------

జనగణన ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా గృహగణన కార్యక్రమం ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. తొలి దశలో భాగంగా ఈ కార్యక్రమం ఈరోజు నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ఈ గృహ గణనలో భాగంగా 33 ప్రశ్నల ఆధారంగా ఇళ్ల పరిస్థితులు, కుటుంబ సభ్యుల వివరాలను అధికారులు సేకరించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గృహగణన మే 1వ తేదీ నుంచి 30 వరకు, తెలంగాణలో మే 11 వ తేదీ నుంచి జూన్ 9 వరకు జరగనుంది.

---------------------------

కోస్తాంధ్ర దాన్ని అనుకొని ఉన్న తెలంగాణపై ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఈరోజు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది.

తెలంగాణాలోనూ ఈరోజు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది.

---------------------------

తెలంగాణలోని గ్రామీణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థికసంఘం నిధుల కింద 247.94 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ ప్రకటించింది. 2025-26 ఆర్థికసంవత్సరంలో తొలి విడత కింద ఈ మొత్తాన్ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. తెలంగాణతో పాటు రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలకు కలిపి 1,500 కోట్లు విడుదల చేయగా వాటిలో 16.52 శాతం నిధులు తెలంగాణకు మంజూరు చేశామని తెలిపింది.

=====================